

అకాల వర్షం..
అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని కాంగ్రెస్ నేత కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు. 10లో▸



కారు బీభత్సం
అతివేగంగా వచ్చిన కారు బైక్‌ను ఢీ కొట్టడంతో వ్యక్తికి గాయాలైన సంఘటన మీర్‌పేట పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. 10లో▸



మైనింగ్ రద్దు చేయాలి
మైనింగ్ కంపెనీ ఏర్పాటు చేయవద్దని మండల పరిధిలోని ముద్విన్ గ్రామస్తులు మొర పెట్టుకున్నారు. 10లో▸

న్యూస్‌రీల్

కొండాను గెలిపించండి



కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరిన నాయకులు

కందుకూరు: చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జీ.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. కందుకూరు మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి పలువురు నాయకులు బుధవారం ఆయన సమక్షంలో బీజేపీలో చేరారు. లేమూరు ఎంపీటీసీ సభ్యుడు యాదయ్య, ఆ గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, నారాయణరెడ్డి, అగర్‌మియాగూడ మాజీ ఉప సర్పంచ్ ఆదీబ్ తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు భిక్షపతి, జగదీశ్వర్‌రెడ్డి, ఆంజనేయులు, యాదగిరిరెడ్డి, నారాయణ, వెంకటేశ్, బాలకృష్ణ, శ్రీకాంత్, రవీందర్‌రెడ్డి, రాజు, రాఘవేందర్, ఆకాష్‌రెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

శంషాబాద్‌లో బీఆర్‌ఎస్‌కు షాక్

కాంగ్రెస్‌లో చేరిన కారు పార్టీ కౌన్సిలర్లు

శంషాబాద్ : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శంషాబాద్‌లో బీఆర్‌ఎస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. మాజీ మంత్రి కేటీఆర్ రోడ్‌షో సక్సెస్ అయిందన్న సంతోషంలో ఉన్న బీఆర్‌ఎస్‌కు మరుసటిరోజే కౌన్సిలర్లు షాకిచ్చారు. చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో 2వ వార్డు కౌన్సిలర్ భద్రునాయక్, 22 కౌన్సిలర్ ఎం.శ్రీకాంత్‌యాదవ్, 23వ వార్డు కౌన్సిలర్ శ్రవంత్‌శ్రీకాంత్‌రెడ్డి, 13వ వార్డు కౌన్సిలర్ బండి భాగ్యలక్ష్మి, 5వ వార్డు కౌన్సిలర్ మస్రజీజా తాజీబా సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి రోడ్‌షోలో 15వ వార్డు బీఆర్‌ఎస్ కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సంజయ్‌యాదవ్, పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే బీసీలకు గుర్తింపు

పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని



సమావేశంలో మాట్లాడుతున్న కాసాని, చిత్రంలో ఎమ్మెల్యే సబితారెడ్డి, స్వామిగౌడ్


హుడాకాంప్లెక్స్: బీఆర్‌ఎస్ పార్టీతోనే బీసీలకు గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. బుధవారం సరూర్‌నగర్ డివిజన్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాసాని మాట్లాడుతూ.. ఉచితాల పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. పార్లమెంటులో తెలంగాణ సమస్యలు, బీసీల గళం వినిపించాలంటే బీఆర్‌ఎస్ పార్టీకి మెజార్టీ ఎంపీ సీట్లు గెలిపించాలని కోరారు. సబితారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వానికి అతి తక్కువ కాలంలోనే ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చిందని అన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ నాయకులు గోపాల్, అంకిరెడ్డి, అరవింద్‌కుమార్, జహీర్, రుషిగుప్తా, సలీం, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళాశాలను తరలించుకుపోయారు..

కందుకూరు: బీఆర్‌ఎస్ హయాంలో తాము కందుకూరులో శంకుస్థాపన చేసిన మెడికల్ కళాశాల, ఆస్పత్రులను.. అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి ఇక్కడ నిర్మించకుండా రద్దుచేసి కొడంగల్ తరలించుకుపోయారని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ఆరోపించారు. బుధవారం రాత్రి కందుకూరులో శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌తో కలిసి నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఫార్మాసిటీ ఏర్పాటుకు భూములు సేకరిస్తే... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఫార్మాసిటీని రద్దు చేసిందని.. దీంతో ఈ ప్రాంతంలో భూముల ధరలు పడిపోయాయన్నారు. కాసాని జ్ఞానేశ్వర్‌కు ఓటువేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీనర్సింహారెడ్డి, అంజయ్యగౌడ్, దశరథ, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్‌రెడ్డి, మహిళా నాయకురాలు జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్.. లైట్!

ఓటింగ్‌కు దూరంగా చేవెళ్ల లోక్‌సభ పరిధి ప్రజలు
- ప్రతి ఎన్నికల్లో తక్కువ శాతం నమోదు
- గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణాల్లోనే అధికం
- ఈసారైనా ఈసీ కృషి ఫలించేనా?



చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో అసెంబ్లీ (2018, 2023), లోక్‌సభ (2019) పోలింగ్ గ్రాఫ్



సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఐటీకి కేంద్ర బిందువైన చేవెళ్ల లోక్‌సభ స్థానం పరిధిలో తక్కువ ఓటింగ్‌శాతం నమోదవుతుండటంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఉన్నత చదువులు చదివిన ఉద్యోగస్తులు, ఓటుహక్కుపై అంతో ఇంతో అవగాహన ఉన్నవారే ఇక్కడ అధికంగా ఉంటారు. అయితే ఓటింగ్ రోజున మెజార్టీ పౌరులు పోలింగ్ బూత్ వరకు వచ్చి తమ ఓటుహక్కును ఉపయోగించుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. క్యూలైన్‌లో నిలబడే ఓపిక లేకపోవడం, ఓటింగ్ రోజును హాలీడేగా భావించి టూర్లకు, దైవదర్శనాలకు వెళ్లడం ఇక్కడి వారికి అలవాటుగా మారిందనే విమర్శలూ లేకపోలేదు.

గ్రామీణ ఓటర్లే బెటర్..!

ఐటీ పరిశ్రమ బాగా విస్తరించడంతో పాటు అక్షరాస్యత ఎక్కువగా ఉన్న శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, మహేశ్వరం, చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రతీ ఎన్నికల్లో అతి తక్కువ ఓటింగ్ నమోదవ్వడం ఆందోళన కలిగిస్తోంది. దీనికి ఉదాహరణ ఈ ప్రాంతంలో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో నమోదైన పోలింగ్ శాతంతో పోలిస్తే.. 2019 లోక్‌సభ ఎన్నికల్లో దాదాపు 12శాతం తక్కువగా పోలింగ్ నమోదైంది. అయితే అక్షరాస్యత తక్కువగా ఉండే పల్లెల్లో మాత్రం పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. పల్లెల్లో ఓటింగ్ శాతం ఎక్కువగా నమోదువుతోంది.

ఆశించిన చైతన్యం రావడం లేదు..

గత లోక్‌సభ ఎన్నికల్లో అనేక ప్రాంతాల్లో త్రిముఖ పోటీ నెలకొనడంతో ఓటింగ్‌శాతం పెరుగుతుందని అంతా భావించారు. అయితే ఆశించిన స్థాయిలో ఓటింగ్ పెరగలేదు. ఓటింగ్ తగ్గుదల అభ్యర్థుల గెలుపోటములపై తప్పకుండా ప్రభావం చూపుతుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఓటింగ్‌శాతం పెంచేందుకు ఎన్నికల సంఘం అనేక చర్యలు చేపడుతున్నా.. ఆశించిన స్థాయిలో ఓటర్లలో చైతన్యం రావడం లేదు. గత లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల లోక్‌సభ పరిధిలో 53.80 శాతం పోలింగ్ నమోదు కాగా, మల్కాజ్‌గిరిలో 42.75 శాతం పోలింగ్ మాత్రమే నమోదైంది. అయితే ఈసారి ఎన్నికల కమిషన్ ఓటింగ్ శాతం పెంచేందుకు ఇక్కడ విస్తృత ప్రచారం చేస్తోంది. ప్రస్తుతం ఎండలు భగ్గున మండుతుండటంతో ఓటింగ్‌పై దీని ప్రభావం పడకూడదనే ఉద్దేశంతో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటు వేసే అవకాశం కల్పించింది. ఓటరు అవగాహన సమావేశాలు సైతం విస్తృతంగా నిర్వహించింది. ముఖ్యంగా యువత ఓటింగ్‌లో పాల్గొనేలా కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. అయితే ఈసారి బద్దకాన్ని వీడి.. బాధ్యతగా ఓటు వేస్తారో? లేక గత ఎన్నికల మాదిరిగానే వ్యవహరిస్తారో తెలియాలంటే? ఈనెల 13వ తేదీ వరకు వేచి చూడాల్సిందే.

పోస్టల్ బ్యాలెట్ గడువు పెంపు

- 10వ తేదీ వరకు ఓటువేసే అవకాశం
- ఎన్నికల సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలి: ఆర్‌ఓ, కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డి జిల్లా: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్ల (వీఎఫ్‌సీ) ద్వారా పోస్టల్ బ్యాలెట్ ద్వారా వేసే ఓటింగ్ గడువును ఎన్నికల సంఘం ఈనెల 10వ తేదీ(శుక్రవారం) వరకు పొడిగించిందని చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక తెలిపారు. వాస్తవానికి బుధవారంతో గడువు ముగియగా.. ఎన్నికల కమిషన్ మరో రెండు రోజుల పాటు గడువు పొడిగించిందని.. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఈనెల 7వ తేదీ వరకు 16,088 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కును వినియోగించుకున్నారని ఆయన తెలిపారు. అలాగే 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు 994 మంది.. ఓట్ ఫ్రమ్ హోమ్‌లో భాగంగా ఇంటినుంచే ఓటుహక్కును వినియోగించుకున్నారని కలెక్టర్ తెలిపారు.

సెకెండ్ ర్యాండమైజేషన్ పూర్తి..

చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ స్థానానికి సంబంధించిన అదనపు ఈవీఎంల సెకండ్ ర్యాండమైజేషన్ ప్రక్రియ బుధవారం ముగిసింది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక నేతృత్వంలో సాధారణ పరిశీలకులు రాజేందర్ కుమార్ కటారియా, వ్యయ పరిశీలకులు రాజీవ్ చావ్రా సమక్షంలో అదనపు కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్ల రెండవ విడత ర్యాండమైజేషన్ నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన చేవెళ్ల లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలోని వికారాబాద్ జిల్లాలో గల పరిగి, వికారాబాద్, తాండూర్ అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో కమిషనింగ్ సందర్భంగా సాంకేతిక సమస్యలు తలెత్తిన ఈవీఎంల స్థానంలో అదనంగా కేటాయించబడిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు బుధవారం రెండవ విడత సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ నిర్వహించారు. పోలింగ్ సమయంలో ఎక్కడైనా ఈవీఎంలలో సాంకేతిక సమస్య తలెత్తితే, నిమిషాల వ్యవధిలోనే సెక్టోరల్ అధికారులు సంబంధిత పోలింగ్ స్టేషన్‌కు చేరుకుంటే తమ వద్ద రిజర్వ్‌లో ఉండే కంట్రోల్ యూనిట్లను సమకూరుస్తారని కలెక్టర్ తెలిపారు. గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులు, ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులు, వారి తరపున ప్రతినిధులు, సంబంధిత అధికారులు ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ సందర్శన..

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) సెంటర్‌ను, కంట్రోల్ రూమ్‌ను ఎన్నికల వ్యయ పరిశీలకులు రాజీవ్ చావ్రా బుధవారం పరిశీలించారు. ఎంసీఎంసీలోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఐడీఓసీలో నెలకొల్పిన కంట్రోల్ రూంను సందర్శించారు. 1950 టోల్‌ఫ్రీ ద్వారా వస్తున్న ఫిర్యాదులు, వాటిని పరిష్కరిస్తున్న తీరుతెన్నులు గమనించారు. చెక్‌పోస్టుల వద్ద తనిఖీ బృందాల పని తీరు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల పనితీరును కంట్రోల్ రూంలో జీపీఆర్‌ఎస్ విధానం ద్వారా పర్యవేక్షిస్తున్న విధానాన్ని ఆయన పరిశీలించారు.



కేశంపేట: సమావేశంలో మాట్లాడుతున్న చల్లా వంశీచంద్‌రెడ్డి

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి

మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి

కేశంపేట: దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ తప్పక అధికారంలోకి రావాలని మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని సంగెం, కేశంపేట, కొండారెడ్డిపల్లిలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డితో కలసి చల్లా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఆర్‌ఎస్, బీజేపీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే షాద్‌నగర్ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. హస్తం గుర్తుకు ఓటువేసి చల్లాను ఎంపీగా గెలిపించాలని కోరారు. అనంతరం మండల పరిధిలోని పాల్కొనిగుట్ట తండాకు చెందిన పలువురు నాయకులు ఎమ్మెల్యే శంకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వీరేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, నాయకులు.. శ్రీధర్ రెడ్డి, ఆనంద్‌కుమార్, సుందరయ్య, రూప్లానాయక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి..

షాబాద్: కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని రాజ్యసభ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి నగరంలో శ్రీనివాస్‌గౌడ్, జీఎంఎస్ గ్రూప్ చైర్మన్ ఇర్ఫాన్, ఫహీమ్ ఖురేషీ తమ అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలు విషయంలో చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. హస్తం గుర్తుకు ఓటువేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షరీఫ్, జాకీర్‌షరీఫ్, నాయకులు తదితరులున్నారు.

రంజిత్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం..

మొయినాబాద్ రూరల్: చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు సమష్టిగా పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్ అన్నారు. మొయినాబాద్ మండలంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో సీపీఎం, సీపీఐ, జనసమితి, మిగతా ప్రజా సంఘాలన్నిటికి సంబంధించి పీసీసీ కార్యవర్గం తనను కమిటీ సభ్యుడిగా నియమించిందని తెలిపారు. అందరినీ కలుపుకొని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు. తన నియామకానికి సహకరించిన మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ దిలీప్‌కుమార్, ఎమ్మెల్సీ వెంకట్ తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మెజార్టీ సీట్లు సాధిస్తాం

- బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ



కొత్తూరు: ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న డీకే అరుణ

కొత్తూరు: దేశ రక్షణ కేవలం బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. కొత్తూరు మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం నిర్వహించిన ప్రచార కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. బీజేపీ పాలనలోనే దేశం అన్ని రంగాల్లో పురోగతి సాధించిందని, ప్రపంచంలో భారత దేశానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ వల్లనే ఒక ప్రత్యేకత వచ్చిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం గత పదేళ్లలో పెద్ద మొత్తంలో నిధులు కేటాయించినప్పటికీ.. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు అదేపనిగా ఎన్‌డీఏ సర్కార్‌ను విమర్శిస్తున్నాయన్నారు. అయితే ప్రజలు అన్నిటిని గమనిస్తున్నారని.. లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ సీట్లు సాధించి మూడోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కమలం పువ్వు గుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, నర్సింహగౌడ్, సదానంద్‌గౌడ్, రమేష్, మాణిక్యం, నాగరాజుచారి తదితరులు పాల్గొన్నారు.

పదేళ్లలో విప్లవాత్మక మార్పులు

షాద్‌నగర్: దేశం మరింత అభివృద్ధి సాధించాలంటే కేవలం బీజేపీ ద్వారానే సాధ్యమని ప్రముఖ నటి, ఎంపీ నవనీత్ కౌర్ అన్నారు. మంగళవారం షాద్‌నగర్ పట్టణంలో బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ నిర్వహించిన రోడ్‌షోలో నవనీత్ కౌర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ... దేశాభివృద్ధి కోసం బీజేపీ ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుందని అన్నారు. తద్వారా పదేళ్లలో దేశంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయన్నారు. కమలం పువ్వు గుర్తుకు ఓటువేసి డీకే అరుణను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి, నాయకులు.. అందెబాబయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేశంపేటలో టెన్షన్.. టెన్షన్

- ఒకే సమయంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల ప్రచారం
- కాంగ్రెస్ కార్నర్ మీటింగ్ వైపు దూసుకెళ్లేందుకు కమలదళం యత్నం
- బారికేడ్లు, పోలీసులను తోసుకుంటూ ముందుకు వెళ్లిన నేతలు
- పోటాపోటీగా ఇరువర్గాల నినాదాలు



బీజేపీ కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు

కేశంపేట: ఆ రెండు పార్టీల నేతల పోటాపోటీ నినాదాలతో షాద్‌నగర్ నియోజకవర్గం కేశంపేటలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. వివరాలు.. జిల్లాలోని షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని కేశంపేటలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు బుధవారం దాదాపు ఒకే సమయంలో ప్రచారం చేపట్టాయి. ప్రచారానికి సంబంధించి ఆయా పార్టీల నాయకులు అనుమతులు కూడా తీసుకున్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు అంబేద్కర్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్ నిర్వహిస్తున్నారు. అదే సమయంలో ప్రచారంలో భాగంగా ర్యాలీ నిర్వహించేందుకు బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకె అరుణతో పాటు ఆ పార్టీ ముఖ్యనాయకులు కేశంపేటకు చేరుకున్నారు. ఈ క్రమంలో బీజేపీ నాయకులు కాంగ్రెస్ కార్నర్ మీటింగ్ వైపు వెళ్లకుండా వైఎస్సార్ చౌరస్తా వద్ద పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేయడంతో పాటు వారిని నిలువరించారు. అయితే ఈ మార్గం గుండా ర్యాలీ నిర్వహించేందుకు తమకు అనుమతులు ఉన్నాయని, ఎందుకు అడ్డుకుంటున్నారో చెప్పాలని బీజేపీ నేతలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

పోటాపోటీ నినాదాలు..

ఈ క్రమంలో వైఎస్సార్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లను తొలగించడంతో పాటు పోలీసులను తోసుకుంటూ బీజేపీ నాయకులు.. కాంగ్రెస్ కార్నర్ మీటింగ్ జరుగుతున్న అంబేద్కర్ చౌరస్తా వైపు దూసుకెళ్లారు. ఇరుపార్టీల కార్యకర్తలు ఒకేచోటుకు రావడంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బీజేపీ నాయకులు జై మోదీ, జై బీజేపీ, జై శ్రీరాం అంటూ నినాదాలు చేశారు. అక్కడే ఉన్న కాంగ్రెస్ నాయకులు జై కాంగ్రెస్, జై సోనియా అంటూ పోటాపోటీగా నినాదాలు చేశారు. దీంతో అక్కడ టెన్షన్ వాతావరణం నెలకొంది. పరిస్థితి చేయిదాటకముందే పోలీసులు ఇరువర్గాలకు నచ్చచెప్పి శాంతింపజేశారు.

భువనగిరి అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..?

- బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు సీపీఎం ఎంపీ అభ్యర్థి జహంగీర్ సవాల్
- ఇబ్రహీంపట్నంలో ముమ్మర ప్రచారం

ఇబ్రహీంపట్నం: భువనగిరి ప్రాంత అభివృద్ధిపై బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చర్చకు రావాలని సీపీఎం ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్ సవాల్ విసిరారు. ఇబ్రహీంపట్నం మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం పాషానరహరి స్మారక కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో జహంగీర్ మాట్లాడుతూ.. భువనగిరి లోక్‌సభ పరిధిలో తాగు, సాగునీటి సమస్య తీవ్రంగా ఉందని.. ఇబ్రహీంపట్నం వేదికగా ఈ అంశంపై చర్చకు ముందుకు రావాలని సవాల్ విసిరారు. స్థానిక సమస్యలపై ఎటువంటి అవగాహన లేని నాయకులు కేవలం డబ్బుతోనే ఎన్నికల్లో గెలవచ్చనే అపోహలో ఉన్నారని విమర్శించారు. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు సీపీఎంకు ఒక్క అవకాశం ఇవ్వాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు జాన్‌వెస్లీ, సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు జయలక్ష్మి, జిల్లా కార్యదర్శి భాస్కర్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్, నాయకులు.. సామేల్, యాదయ్య, జగదీశ్, నర్సింహ, కవిత, జగన్, జంగయ్య, ఎల్లేశ్ పాల్గొన్నారు.

బీజేపీని బొంద పెట్టాలి

- ఆ పార్టీ మాట వినని వారిపై ఈడీ, సీబీఐని ఉసిగొల్పుతోంది
- ముఖ్యమంత్రులతో పాటు కేసీఆర్ కూతురుపై కేసులు పెట్టింది
- రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నారు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



ఇబ్రహీంపట్నం రోడ్ షోలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ఇబ్రహీంపట్నం: మతోన్మాద బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో బొందపెట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. భువనగిరి లోక్‌సభ సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ బుధవారం సాయంత్రం ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన రోడ్ షోలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, మతోన్మాదాన్ని పెంచి పోషిస్తూ.. విద్వేషాలను రెచ్చగొడుతోందని బీజేపీపై ధ్వజమెత్తారు. పేదలకు ఇళ్లు, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు, రైతు ఆదాయం రెట్టింపు వంటి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. గిట్టుబాటు ధరల కోసం ఢిల్లీలో ఆందోళన చేపట్టిన 760 మంది రైతులను పొట్టన పెట్టుకున్న పాపం ఆ పార్టీదేనని మండిపడ్డారు. మోదీ ప్రభుత్వంలో మహిళలకు రక్షణకు లేకుండాపోయిందని, వీరిపై జరుగుతున్న అఘాయిత్యాల కేసుల్లో బీజేపీ నేతలే ప్రధాన ముద్దాయిలుగా ఉన్నారని తెలిపారు. రాజ్యాంగ సంస్థలను అణగదొక్కేందుకు మోదీ సర్కార్ కుట్ర చేస్తోందని ఆరోపించారు. సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను చెప్పుచేతల్లో పెట్టుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందన్నారు. బీజేపీలో చేరని వారిపై వీటిని ప్రయోగిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రతిపక్షాలకు చెందిన పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు కేసీఆర్ కుమార్తెపై కేసులు పెట్టిందన్నారు. ఎలక్షన్ కమిషన్‌ను నిర్వీర్యం చేసే విధంగా చట్టాన్ని మార్చారన్నారు. ఒకవేళ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే కాంగ్రెస్‌లో గెలిచిన ఎంపీలు ఆ పార్టీలో ఉంటారనే గ్యారంటీలేదని ఎద్దేవా చేశారు. అధికారంతో ప్రమేయం లేకుండా నమ్మిన సిద్ధాంతాల కోసం పనిచేసేదే ఎర్రజెండా అని తెలిపారు. 2006లో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఉపాధి హామి పథకం చట్టాన్ని తెచ్చేలా చేసిన ఘనత కమ్యూనిస్టులదేనని స్పష్టంచేశారు. అటవీ చట్టాన్ని అమలు చేసేలా కేసీఆర్‌పై ఒత్తిడి చేసింది తామేనన్నారు.పార్లమెంట్‌లో మాట్లాడలేని అభ్యర్థులను ఎన్నికల్లో గెలిపిస్తే ప్రయోజనం లేదని తెలిపారు. ప్రజల, కార్మికుల పక్షాన పోరాడే ఆదర్శ కమ్యూనిస్టు ఎండీ జహంగీర్‌ను భువనగిరి నుంచి పార్లమెంట్‌కు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్, నేతలు సామేల్, పి.యాదయ్య, కే. జగన్, జగదీశ్, అలంపల్లి నర్సింహ్మా, కవిత, జయలక్ష్మి పాల్గొన్నారు.

స్వాగత తోరణం కూలి మహిళ మృతి

చిన్నమంగళారంలో ఈదురుగాలుల బీభత్సం

మొయినాబాద్: బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాల స్వాగత తోరణం ఈదురు గాలులకు కూలి ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన మండల పరిధిలోని చిన్నమంగళారంలో చోటుచేసుకుంది. మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జహీరాబేగం(45) మంగళవారం రాత్రి కూరగాయలకు వెళ్తుండగా వేగంగా ఈదురు గాలులు వీచాయి. ఈ క్రమంలో గ్రామంలో ఇటీవల బీరప్ప బ్రహ్మోత్సవాల సందర్భంగా విద్యుద్దీపాలతో స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. ఈదురు గాలికి ఆ తోరణం కూలి మహిళపై పడింది. తీవ్ర గాయాలైన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వివరాలు సేకరించి మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

హెచ్చరిక ప్రకటన

నా క్లయింట్ Ms. పోలె అను కీర్తన తండ్రి బాల్‌రెడ్డి, వయసు సుమారు 14 సంవత్సరాలు, మైనర్ అయినందున ఆమె సహజ సంరక్షకురాలు తల్లి సంరక్షణలో ఉన్నది మరియు సంరక్షకురాలు శ్రీమతి పోలె శ్రీ బిందు భర్త పోలె బాల్‌రెడ్డి గారు రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం, పొల్కంపల్లి గ్రామం వద్ద గల సర్వే నం.426/A లోని ఎ.3-28 గుంటల విస్తీర్ణం గల ఆస్తులలో హక్కులు కలిగి ఉన్నందున మరియు ఆమె లేటు శ్రీ పోలె బల్వంత్‌రెడ్డి యొక్క న్యాయవారసురాలు అయినందున దావాలో ఇంప్లీడ్ చేయవలసిందిగా కోరుటకు గౌరవనీయ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, ఇబ్రహీంపట్నం ఫైల్ పై O.S. నం.194/2022 లో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేసారని ఇందు మూలంగా సాధారణ ప్రజలందరికీ తెలియజేయడమైనది.
బోగస్ AGPA డాక్యుమెంట్ నం.7219/2012 ఆధారంగా నా క్లయింట్ తండ్రి శ్రీ పోలె బాల్‌రెడ్డితో లాలూచీపడి శ్రీ ఏకుల నరేందర్‌రెడ్డి & ఇతరులు పై దావాను అనగా OS 194 ఆఫ్ 2022 దాఖలు చేసారని నా క్లయింట్‌కు ఇటీవల తెలిసినది మరియు పై దావాలో పార్టీలు ఒకరితో ఒకరు లాలూచీపడి నా క్లయింట్ యొక్క న్యాయబద్ధమైన హక్కులను హరించాలనే ఉద్దేశ్యంతో పై దావాను ఉపసంహరించు కొనుట ద్వారా శ్రీ దొండ వినోద్‌రెడ్డి తండ్రి బుచ్చిరెడ్డి మరియు గంటిల్ల వెంకటేష్ తండ్రి మల్లయ్య పేరున ఆస్తులను అన్యాక్రాంతం చేయుటకు ఉద్దేశిస్తున్నారని విశ్వసనీయంగా తెలిసినది. అందువలన నా క్లయింట్ ఇప్పటికే ఇంప్లీడ్ పిటిషన్‌ను పై దావాలో దాఖలు చేసారు మరియు అది పెండింగ్‌లో ఉన్నది. సదరు దొండ వినోద్‌రెడ్డి & గంటిల్ల వెంకటేష్ పై దావాలోని పార్టీలతో అమ్మక ఒప్పందం కూడా కుదుర్చుకున్నట్లు మరియు నా క్లయింట్లు నమ్మతిలేకుండా పై భూములకు సంబంధించి బయానా కూడా చెల్లించినట్లు తెలిసినది.
అందువలన పై సదరు శ్రీ పోలె బాల్‌రెడ్డి & ఏకుల నరేందర్‌రెడ్డి మరియు ఇతరులు లేదా వారి ఏజెంట్లతో పై సదరు ఆస్తులకు సంబంధించి ఏవిధమైన సంప్రదింపులు జరుపరాదని సాధారణ ప్రజలను మరియు శ్రీ దొండ వినోద్‌రెడ్డి & గంటిల్ల వెంకటేష్‌లను ఇందుమూలంగా హెచ్చరించడమైనది. ఈ ప్రచురణ తరువాత కూడా ఎవరైనా వ్యక్తి లేదా వ్యక్తులు అవిధంగా ముందుకుసాగితే వారు వారి స్వంత నష్టపూరీ మరియు పర్యవసానాలపై చేసినట్లవుతుంది. అందువలన ఈ నోటీసు జారీచేయడమైనది.

సం/- A. జగన్ మోహన్ రెడ్డి, అడ్వకేట్
10-4-99/32, అల్తాఫ్‌నగర్, బైరామల్‌గూడ, రంగారెడ్డి జిల్లా.
సెల్: 7386005205, 9010121825

IN THE COURT OF THE XIV ADDL. CHIEF JUDGE, CITY CIVIL COURT AT: HYDERABAD
OP. No.1130 of 2023

Between:
P Haritha @ E Shiresha & Others ...Petitioner
And
Singothu Babu & another ...Respondent

NOTICE

To
Singothu Babu S/o. S Kotaiah
Aged: 48 Years, Occ: Owner Cum Driver, R/o. 3-3-80/18/5/2/A, Erraboda, Upperpally, Rajendra nagar, Ranga Reddy Dist.

Please take notice in above case, above named petitioners we have filed a claim application claiming compensation against you and the Insurance Company that one Mr. E. Ashok was involved in road accident and he died with your vehicle Bearing No.TS-07-UL-7711. The said matter is posted for your appearance on 21-05-2024.
Hence, make it convenient to appear in above mentioned court on the above mentioned date 10:30 a.m. in person or through an Advocate otherwise the matter will be decided in your absence accordingly.

(BY ORDER OF THE COURT)
Counsel for the Petitioner
M/S. KASIREDDY JAGATHPAL REDDY AND ASSOCIATES,
Advocate
H.No.3-4-491/1, 1 Floor,
Barkatpura, Hyderabad.



మంచాల: ఆరుట్లలో దెబ్బతిన్న బొప్పాయి తోటను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు



మంచాల: చెన్నారెడ్డిగూడలో పౌల్ట్రీ రైతు మహేష్‌కు ఆర్థికసాయం అందిస్తున్న బహదూర్

అకాల వర్షం.. రైతన్నకు నష్టం

అకాల వర్షాలకు జిల్లా వ్యాప్తంగా రైతాంగం తీరని నష్టాన్ని చవి చూసింది. మంగళవారం రాత్రి కురిసిన వానకు చేతికొచ్చిన పంటలు నేలకొరిగాయి. విపరీతమైన ఈదురుగాలులకు చెట్లు, షెడ్లు, ఇళ్లు ధ్వంసమయ్యాయి. పలు చోట్ల రాజకీయ నాయకులు పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేయాలని ప్రభుత్వాన్ని కోరారు.



కొందుర్గు: ముట్పూర్‌లో ఈదురుగాలికి ఎగిరిపోయిన ఇంటి పైకప్పు

- ధ్వంసమైన పంట పొలాలు
- నేలరాలిన మామిడి కాయలు
- బాధిత రైతులను ఆదుకోవాలని నాయకుల డిమాండ్

మంచాల: అకాల వర్షాలకు పంట పొలాలు దెబ్బతిన్న రైతాంగాన్ని ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు. బుధవారం బండలేమూర్, చెన్నారెడ్డిగూడ, ఆరుట్ల గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేతికి వచ్చిన వరి పంట వానకు పాడైపోయి రైతులు నష్టపోయారన్నారు. చెన్నారెడ్డిగూడలో గాలి వానకు పౌల్ట్రీఫాం రేకులు ధ్వంసమయ్యాయి. అధికారులు యుద్ధ ప్రాతిపదికన పంట నష్ట వివరాలు సేకరించాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, రాంరెడి, బుగ్గరాములు, హన్మంత్‌రెడ్డి, వెంకటేష్, చంద్రయ్య, యాదయ్య, మాసయ్య తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే ఆదుకోవాలి

వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు పాండాల జంగయ్యగౌడ్ డిమాండ్ చేశారు. ఆరుట్ల గ్రామంలో వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్న బొప్పాయి, మామిడి తోటలను పరిశీలన చేశారు. లక్షల రూపాయలు అప్పులు చేసి పంటలు సాగు చేసి రైతులు అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్నడంతో తీవ్రంగా నష్టపోయారన్నారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, సత్తిరెడ్డి, భగవంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

వర్షాలకు నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వాలు అండగా నిలవాలని బీఆర్‌ఎస్ నాయకుడు మొద్దు సికిందర్‌రెడ్డి కోరారు. చెన్నారెడ్డిగూడలో వర్షాలకు పౌల్ట్రీఫాం దెబ్బతిని నష్టపోయిన రైతు మహేష్‌కు బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బహదూర్ రూ.5వేలు ఆర్థిక సాయం చేశారు. ప్రభుత్వం కూడా వెంటనే సహాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జానిపాషా, రాము, జంగయ్య, శ్రీశైలం, శ్రీకాంత్, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

గాలికి ఎగిరిన ఇంటి పైకప్పు

కొందుర్గు: కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లోని వివిధ గ్రామాల్లో మంగళవారం కురిసిన గాలి వానకు తీరని నష్టం వాటిల్లింది. కొందుర్గు మండలం ముట్పూర్ గ్రామానికి చెందిన బేగరి రామకిష్టయ్య ఇంటి పైకప్పు గాలికి ఎగిరిపోయింది. ఇంటిలోనే ఉన్న అనంతమ్మ చేతికి గాయాలయ్యాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

కాంగ్రెస్‌తోనే సమన్యాయం

పార్టీ రాష్ట్ర నాయకురాలు వెన్నెల



ఆమనగల్లులో మహిళతో మాట్లాడుతున్న వెన్నెల

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ప్రజాగాయకుడు గద్దర్ కుమార్తె, పార్టీ రాష్ట్ర నాయకురాలు వెన్నెల పేర్కొన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన కొనసాగుతుందని ఆమె అన్నారు. ఆమనగల్లు మండలంలోని పలు గ్రామాలు, పట్టణంలోని పలు కాలనీలలో బుధవారం నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ అభ్యర్థి డా.మల్లురవికి మద్దతుగా ఆమె విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెన్నెల మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలోనే సామాజిక న్యాయం సాధ్యమన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజల మన్ననలు పొందిందన్నారు. ఎన్నికల ముందు చెప్పిన విధంగా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే దేశ ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం దేశంలో మత విద్వేషాలను రెచ్చగొట్టి విభజన రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేదల కోసం ఏనాడూ పని చేయలేదని, కేవలం కార్పొరేట్ కంపెనీల మేలు కోసమే పనిచేశారని విమర్శించారు. విభజన రాజకీయాలు సాగించే బీజేపీకి పార్లమెంటు ఎన్నికలలో బుద్ధి చెప్పాలని ఆమె కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ జంగయ్య, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ అనంతరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు జగన్, నాయకులు మానయ్య, ఖాదర్‌ఖాద్రి, కృష్ణనాయక్, ఫిరోజ్, రాజు, షర్ఫుద్దీన్, కుమార్‌గౌడ్, అలీం, ఖాదర్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

గుర్రంగూడలో కారు బీభత్సం

- అతివేగంతో అదుపు తప్పిన వాహనం
- విద్యుత్ స్తంభం, బైక్‌ను ఢీకొట్టిన వైనం



పల్టీ కొట్టిన కారు

మీర్‌పేట: అతివేగంగా వచ్చిన కారు పల్టీకొట్టి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో వ్యక్తికి గాయాలైన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం. మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో గుర్రంగూడకు చెందిన జ్ఞానేశ్వర్ తన సోదరుడి కోసం ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనంతో వేచిఉన్నారు. అదే సమయంలో ఓ కారు అతివేగంగా వచ్చి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో పాటు అక్కడే బైకుపై ఉన్న జ్ఞానేశ్వర్‌ను ఢీ కొట్టింది. దీంతో జ్ఞానేశ్వర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కారు వేగానికి విద్యుత్ స్తంభం కూలి మూడు ముక్కలైందని, ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని స్థానికులు తెలిపారు. కారులో ఇద్దరు వ్యక్తులు ఉన్నారని, ఎయిర్ బెలూన్స్ తెరుచుకోవడంతో వారికి ఎలాంటి గాయాలు కాలేదని స్థానికులు వివరించారు. ప్రమాదానికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ తెలిపారు.

రాత్రంతా జాగారమే!

1500కిపైగా ఫీడర్లలో నిలిచిన విద్యుత్ సరఫరా

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఈదురు గాలి సృష్టించిన బీభత్సానికి విద్యుత్ సరఫరా వ్యవస్థ కుప్పకూలింది. గ్రేటర్ సహా శివారు జిల్లాల్లో రాత్రంతా సరఫరా నిలిచిపోయింది. కొన్ని చోట్ల బుధవారం తెల్లవారుజామున సరఫరా పునరుద్ధరించినప్పటికీ.. మరికొన్ని నివాసాల్లో ఇప్పటికీ అంధకారమే రాజ్యమేలుతోంది. ఉక్కపోతకు తోడు దోమలు ప్రజల కంటిమీద కునుకు లేకుండా చేశాయి. మంగళవారం సాయంత్రం ఈదురు గాలితో కూడిన వర్షానికి చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. రంగారెడ్డి జోన్ పరిధిలోనే 350ఫీడర్ల పరిధిలో సరఫరా నిలిచిపోయింది. 20కిపైగా ఎల్‌టీ పోల్స్ పడిపోగా, 11 కేవీ పోల్స్ ఎనిమిది పడిపోయాయి. రెండు డీటీఆర్ నేలకూలాయి. మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటల వరకు వరకు 4300 మెగావాట్లకు పైగా ఉన్న విద్యుత్ డిమాండ్ సాయంత్రం ఆరు తర్వాత ఏకంగా 1000 మెగావాట్లకు పడిపోయింది.

విద్యుత్ లైన్లకు ఫెక్సీల షాక్

పోలెపల్లి–కడ్తాల్ 33 కేవీ ఫీడర్ లైన్‌పై హోర్డింగ్ పడటంతో శంషాబాద్, చిన్న గోల్కొండ సహా పలు ప్రాంతాల్లోని 11 కేవీ ఫీడర్లకు సరఫరా నిలిచిపోయింది. శివరాంపల్లి – మీరాలం 33 కేవీ ఫీడర్‌లైన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో దీని పరిధిలోని ఐదు 11 కేవీ ఫీడర్లకు ఇన్ కమింగ్ నిలిచిపోయింది. నార్సింగిలోని 11 కేవీ లైన్లు తెలిపడ్డాయి. తారామతి భారదరి–కిలావత్ 33 కేవీ లైన్‌కు పతంగి దారం చుట్టు కోవడంతో వైర్లు మెలికపడి షార్ట్‌సర్క్యూట్ సమస్య తలెత్తింది. సీఎండీ ముషారఫ్ ఫారూఖీ పర్యవేక్షణకు తోడు డైరెక్టర్లు, సీజీఎంలు, ఎస్ఈల చొరవతో చకచక లైన్లను పునరుద్ధరించారు.

కిరాణాషాపులో చోరీ

రూ.లక్ష విలువైన సిగరెట్ ప్యాకెట్ల అపహరణ



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఆమనగల్లు: పట్టణంలో జాతీయ రహదారిపై ఉన్న ఓ కిరాణాషాపులో మంగళవారం రాత్రి దుండగులు షట్టర్‌ను పగులకొట్టి రూ.లక్షల విలువైన సిగరెట్ ప్యాకెట్లను ఎత్తుకెళ్లారు. బాధితుని వివరాల ప్రకారం.. ఆమనగల్లు పట్టణంలోని హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై ఏపీజీవీబీ బ్యాంకు పక్కన క్రాంతికుమార్ కిరాణాషాపు ఉంది. మంగళవారం రాత్రి క్రాంతికుమార్ షాపునకు తాళం వేసి ఇంటికి వెళ్లారు. అర్ధరాత్రి దుండగులు షాపు షట్టర్‌ను పగులకొట్టి సిగరెట్ కాటన్ బాక్స్‌లను ఎత్తుకెళ్లారు. ఉదయాన్నే షాపునకు వచ్చిన క్రాంతికుమార్ దొంగతనం జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు రూ.లక్ష విలువ ఉంటుదని తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ బాల్‌రాం, క్లూస్‌టీం పరిశీలించి వివరాలు సేకరించారు. ఇద్దరు యువకులు ఆటోలో వచ్చి దొంగతనం చేసినట్లుగా పోలీసులు భావిస్తున్నారు.

మీ ఇంటికే వస్తున్నామమ్మా..

- కూతురుకు ఫోన్‌చేసి చెప్పిన తల్లిదండ్రులు
- ఆతర్వాత కొద్ది క్షణాలకే రోడ్డు ప్రమాదం
- కారును ఢీకొట్టిన లారీ
- తండ్రి దుర్మరణం, తీవ్ర గాయాలపాలైన తల్లి



దుర్గాప్రసాద్ మృతదేహం



ప్రమాదంలో షాక్‌కు గురైన సరోజ

కందుకూరు: ప్రశాంతంగా దైవ దర్శనాన్ని చేసుకున్నారు. తిరుగు ప్రయాణంలో కాసేపట్లో తమ కుమార్తె ఇంటికి చేరుకుంటామని ఆ భార్యాభర్తలు మురిసిపోయారు. కానీ లారీ రూపంలో వచ్చిన మృత్యువు భర్తను కబళించగా, భార్యను తీవ్ర గాయాలపాలు చేసింది. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు బుధవారం చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లా జగ్గయ్యపేట మండలం షేక్‌మహ్మద్‌పేటకు చెందిన చింతలపూడి దుర్గాప్రసాద్(65) భార్య సరోజతో కలిసి హైదరాబాద్ మలక్‌పేటలో నివసిస్తున్నారు. దుర్గాప్రసాద్ ప్రభుత్వ ఆడిట్ డిపార్టుమెంట్‌లో పని చేసి రిటైరయ్యారు. కుమారుడు అమెరికాలో సెటిల్ అవగా.. కుమార్తె తుక్కుగూడ మున్సిపల్ పరిధిలోని రాంకీ విల్లా వెంచర్‌లో ఉంటున్నారు. గత సోమవారం దుర్గాప్రసాద్ దంపతులు కారులో దైవ దర్శనానికి శ్రీశైలం వెళ్లారు. తిరిగి బుధవారం ఉదయం ఇంటికి బయలుదేరారు. కందుకూరు వద్దకు రాగానే సమీపంలో ఉన్న కూతురుకు ఫోన్ చేసి 'మీ ఇంటికే వస్తున్నామమ్మా' అని చెప్పారు. మరికొద్ది క్షణాల్లో గమ్యం చేరుకోవాల్సి ఉండగా.. శ్రీశైలం రహదారిపై పెద్దిరెడ్డి వెంచర్–కొత్తూర్ వాగు మధ్య ఎదురుగా వస్తున్న లారీ వీరి కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ సీటులో ఉన్న దుర్గాప్రసాద్ తీవ్రంగా గాయపడి ఇరుక్కుపోయారు. సరోజకు తీవ్ర గాయాలు కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. వాహనంలో ఇరుక్కుపోయిన దుర్గాప్రసాద్‌ను, సరోజను స్థానికులు అతి కష్టంగా బయటకు తీసి 108 అంబులెన్స్ వాహనంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే దుర్గాప్రసాద్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సరోజ చికిత్స పొందుతోంది. ఈ మేరకు సీఐ మక్బూల్‌జానీ ఆధ్వర్యంలో ఎస్ఐ సైదులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కయ్యాల కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పండి

- మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కిషన్‌రెడ్డి
- భువనగిరి ఎంపీగా క్యామ మల్లేశ్‌ను ఆశీర్వదించండి



మాట్లాడుతున్న క్యామ మల్లేశ్, పక్కన మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: కయ్యాల కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని స్థానిక మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. భువనగిరి లోక్‌సభ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌తో కలిసి ఇబ్రహీంపట్నంలో కార్నర్ మీటింగ్‌ను బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతలు కొట్లాటలు పంచాయితీలతో ఆరాచకాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. సీఐ, ఏసీపీ, తహసీల్దార్లను ఈ ఐదు నెలల కాలంలోనే పలుసార్లు మార్చారని అన్నారు. రూ.470 కోట్ల నిధులు నియోజకవర్గానికి మంజూరు చేయిస్తే తట్టెడు మట్టి పోసి పనులు ప్రారంభించిన దాఖలాలు నియోజకవర్గంలో లేదన్నారు. క్యామ మల్లేషను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మంచిరెడ్డి విజ్ఞప్తి చేశారు. అలాగే, మల్లేశ్ మాట్లాడుతూ.. ఈ ప్రాంతవాసిని మీ మనిషిని నన్ను ఆశీర్వదించండని అభ్యర్థించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలు ఇప్పటికీ అమలు చేయలేదని విమర్శించారు. తానను గెలిపిస్తే రియల్ ఎస్టేట్, వ్యాపార, పరిశ్రమల రంగాలకు పూర్తి సహకారం అందిస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి ఫాక్స్‌కాన్ కంపెనీ ఇక్కడి తీసుకోస్తే దాని ఉనికిలేకుండా చేశారని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, జనగాం మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ వెంకటరమణారెడ్డి, ఎంపీపీ కృపేశ్‌తో పాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మార్నింగ్ వాక్‌లో 'కొండా' ప్రచారం

బడంగ్‌పేట్: మున్సిపల్ కార్పొరేషన్‌లో అమరుడు సిరిపురం యాదయ్య స్మారక స్టేడియంలో బుధవారం తెల్లవారుజామున వాకింగ్ చేస్తున్న వాకర్లను చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఆయన సురక్షితమైన పాలన బీజేపీతోనే సాధ్యమని, అమూల్యమైన ఓటును తనకు వేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వాకర్లతో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మైనింగ్ కంపెనీ రద్దు చేయాలి

కలెక్టరేట్, ఆర్డీఓకు ముద్విన్ గ్రామస్తుల వినతి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కడ్తాల్: మైనింగ్ కంపెనీ ఏర్పాటు చేయవద్దని మండల పరిధిలోని ముద్విన్ గ్రామస్తులు మొర పెట్టుకున్నారు. గ్రామ సమీపంలో నల్లగుట్టపై మైనింగ్ కంపెనీ ఏర్పాటు అంశంపై పార్లమెంట్ ఎన్నికల లోపు అధికారులు నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎన్నికలను బహిష్కరిస్తామని గ్రామస్తులు తేల్చి చెప్పారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టరేట్‌తో పాటు, కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ సమీపంలో మైనింగ్ క్రషర్ ప్లాంట్ ఏర్పాటు చేయవద్దని, 2022 జూలైలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో అప్పటి జిల్లా అదనపు కలెక్టర్‌తో పాటు, మైనింగ్, పొల్యూషన్ కంట్రోల్ అధికారులకు గ్రామస్తులు ముక్త కంఠంతో నివేదించామన్నారు. అప్పట్లోనే జిల్లా కలెక్టర్‌కు సైతం వినతిపత్రాలు అందించామన్నారు. గ్రామానికి కిలో మీటర్ దూరంలో ఉన్న నల్లగుట్టపై మైనింగ్ కంపెనీ ఏర్పాటు చేస్తే ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారని, సమీప వ్యవసాయ పొలాలు, వన్యప్రాణులకు ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు. కుల వృత్తుల వారు జీవనోపాధి కోల్పోతారని వివరించామన్నారు. ఇదిలా ఉండగా రెండు నెలల క్రితం కొంత మంది నల్లగుట్ట సమీప రైతులను కలిసి మైనింగ్ చేపట్టడానికి వచ్చామని తెలపడంతో గ్రామస్తులు భయాందోళన గురయ్యారు. ప్రభుత్వం వెంటనే మైనింగ్ కంపెనీకి ఇచ్చిన అనుమతులు నిలిపి వేయాలని కోరారు. ప్రజాభిప్రాయానికి భిన్నంగా వ్యవహరిస్తే పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరిస్తామని ముద్విన్ గ్రామస్తులు పేర్కొన్నారు.

నల్లగుట్టను పరిశీలించిన ఆర్‌ఐ

స్థానిక తహసీల్దార్ ఆదేశాల మేరకు బుధవారం మధ్యాహ్నం గ్రామ సమీపంలోని నల్లగుట్టను స్థానిక ఆర్‌ఐ వాహిద్ సందర్శించారు. చుట్టుపక్కల పరిసరాలను పరిశీలించారు. ఎలాంటి మైనింగ్ పనులు చేపట్టలేదని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు ఆర్‌ఐని కలిసి, మైనింగ్ కంపెనీకి అనుమతులు నిలిపి వేయాలని వినతిపత్రం అందజేశారు.

సమష్టి కృషితో బీజేపీని గెలిపిద్దాం

ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బంటు జ్ఞానేశ్వర్



నూతన కమిటీని ప్రకటిస్తున్న బంటు జ్ఞానేశ్వర్

మొయినాబాద్‌రూరల్: బీజేపీ గెలుపే లక్ష్యంగా సమష్టిగా పని చేయాలని పార్టీ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు బంటు జ్ఞానేశ్వర్, జిల్లా నాయకుడు చిలుకూరు గోపాల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మధుసుధన్‌రెడ్డి కోరారు. బుధవారం మండలంలోని అజీజ్‌నగర్ చౌరస్తాలో పార్టీ ఎన్నికల కార్యాలయంలో జిల్లా ఎస్సీ మోర్చా కమిటీని జిల్లా అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ నాయకులతో కలిసి ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేవెళ్లలో బీజేపీ జెండా రెపరెపలాడుతుందన్నారు. ప్రజలు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలను నమ్మే స్థితిలో లేరన్నారు. నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో గ్రామాలు ఎంతో వృద్ధి చెందాయన్నారు. మోదీ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగరడం ఖాయమని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు వెంకటేష్‌గౌడ్, మాధవరెడ్డి, రాజమల్లేష్, మహేందర్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

మొయినాబాద్: ఈదురుగాలులకు తెగిపడిన విద్యుత్ తీగలకు తగిలి ఓ గేదె మృతి చెందింది. ఈ సంఘటన మండల పరిధిలోని పెద్దమంగళారంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తలారి రామకృష్ణ బుధవారం ఉదయం గేదెలను పొలం వద్దకు తీసుకెళ్తున్నారు. మంగళవారం రాత్రి ఈదురుగాలులకు విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. గమనించకుండా గేదె వెళ్లి విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందింది. మరణించిన గేదె విలువ సుమారు రూ.1లక్ష ఉంటుందని ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరుతున్నారు.